## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

న్యాల్‌కల్/కంగ్టి, ఆక్టోబర్ 28 : మండల కేంద్రమైన న్యాల్‌కల్, ఖలీల్‌పూర్ గ్రామాల్లో శనివారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వాల్మీకి మహర్షి విగ్రహాలు, చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**కోహీర్‌లో వాల్మీకి జయంతి**

కోహీర్, అక్టోబర్ 28 : మండలంలోని గొటిగార్‌పల్లిలో బోయ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో శనివారం రామాయణ గ్రంథరచయిత, మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాచయ్య, సొసైటీ వైస్ చైర్మన్ విఠల్‌నాయక్, ఆగమయ్య, సాయన్న, చిరంజీవి, గోపాల్, ప్రశాంత్, కనకరాజు, రాజు, మధుకర్, ప్రభు పాల్గొన్నారు.



గొటిగార్‌పల్లిలో వాల్మీకి జయంతిని నిర్వహిస్తున్న బొయవాల్మీకిలు

## రాచన్నస్వామి ఆలయం మూసివేత

కోహీర్, అక్టోబర్ 28: మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయాన్ని మూసివేశారు. శనివారం పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామివారి దర్శ నం నిలిపివేశారు. అంతకుముందు ఆలయ గర్భగుడిలోని శివలింగానికి అభిషేకం, బిల్వార్చన, అన్నపూజ, మహామంగళహారతి నిర్వహించారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామివారి దర్శనం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవో శివరుద్రప్ప, జగదీశ్వర్‌స్వామి, బస్వరాజ్‌స్వామి ఉన్నారు.

## వృద్ధులకు ఇంటి వద్దకే ఓటు

న్యాల్‌కల్, అక్టోబర్ 28 : రానున్న ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ లక్ష్యంగా 80ఏండ్లు పైబడిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని మండల తహసీల్దార్ రాజిరెడ్డి తెలిపారు. శనివారం న్యాల్‌కల్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బూత్‌లెవల్ ఆఫీసర్లకు ఫారం 12(డీ) ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఫారం 12(డీ), పోస్టల్ బ్యాలెట్ ద్వారా వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, బూత్‌లెవల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండ ల పంచాయతీ అధికారి సురేశ్, ఆర్ఐ దుర్గయ్య, సర్వేయర్ లాల్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు, ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన

కోహీర్, అక్టోబర్ 28: నవంబర్ 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గిర్దావర్ సత్యనారాయణ సూచించారు. శనివారం కొత్తూర్, చింతల్‌ఘాట్, వెంకటాపూర్, గురుజువాడ, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, బీఎల్వోలు ఉన్నారు.




కోహీర్ : ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, బీఎల్వోలు

## తుల్జాపూర్ పాదయాత్ర భక్తులకు అన్నదానం

న్యాల్‌కల్, ఆక్టోబర్ 28: మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీమాత దర్శనానికి పాదయాత్రతో తరలివెళ్తున్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శనివారం మండలంలోని హద్నూర్ వరసిద్ధి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో భవానీమాత దర్శనానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదానం చేస్తున్నట్టు వర సిద్ధివినాయక భక్త మండలి సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వర సిద్ధివినాయక భక్త మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# కేసీఆర్ వెంటే ప్రజలు

మునిపల్లి, అక్టోబర్ 28: ప్రజలకు అబద్ధపు హామీలు ఇస్తామని మోసం చేయడంలో కాంగ్రెస్‌ను మించిన మరొక పార్టీ లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, మునిపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మంతురి శశికుమార్ అన్నారు. శనివారం మండలంలోని లింగంపల్లి, మేళసంగం గ్రామాల్లో ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు మద్దతుగా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు.



లింగంపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 60 ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు చేయని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇప్పుడు ఇవ్వడం ఎలా సాధ్యమవుతదన్నారు. పూటగడపడం కోసం లేనిపోని మాయమాటలు చెప్పి ప్రజలను ఇబ్బందులకు గురిచేసేందుకు ఇదొక కొత్త నాటకం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు గ్రామాల్లో గడప గడపకు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలు అనే ముసుగు వెసుకొని ఓట్లు అడిగేందుకు వస్తున్నారన్నారు. ప్రజలు కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు ఉన్నారు.

# సర్పంచ్ పాడె మోసిన ఎమ్మెల్యే

- ప్రభాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు
- ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రాయికోడ్, అక్టోబర్ 28 : ప్రభాకర్‌రెడ్డి మరణం పార్టీకి, మండల ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. శనివారం మండలంలోని సంగాపూర్ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దీంతో సంగాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శనివారం కుటుంబ సభ్యులు గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు స్థానిక ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి మరణం పార్టీకి, మండల ప్రజలకు తీరని లోటు అన్నారు. ఎప్పుడు ప్రజల శ్రేయస్సు కోసం పని చేశాడని గుర్తు చేశారు. సర్పంచ్ అయిన రోజు నుంచి గ్రామాన్ని అన్ని దిశల అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది, మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అవార్డును సైతం అందుకున్నారన్నారు. ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు జైపాల్‌రెడ్డి, చంటి రాహుల్‌కిరణ్, జడ్పీటీసీ మల్లిఖార్జున్‌పాటిల్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్ధన్నపాటిల్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, కార్యదర్శి బస్వరాజుపాటిల్, వైస్ చైర్మన్ వీరారెడ్డి, వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రజినీకాంత్, తుకారాం, ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సర్పంచ్ పాడెను మోస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

## అలయి బలయ్ విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు



వట్‌పల్లి, అక్టోబర్ 28 : నిన్నటి అలయి బలయిను విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులకు నాయకులకు ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ధన్యవాదాలు తెలిపారు. ప్రతి దసరాకు నిర్వహిస్తున్న అలయి బలయి కార్యక్రమంలో మిత్రులు శ్రేయోభిలాషులు పార్టీ సీనియర్ నాయకులతో పాటు రాజకీయాలతో సంబం దం లేకుండా కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్‌కు, ఎమ్మెల్సీ, కవి గోరటి వెంకన్న, ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ, ఆటపాటలతో అలరించిన కళాకారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు జడ్పీటీసీలకు, ఎంపీపీలకు, ఎంపీటీలకు, సర్పంచ్‌లకు, సోసైటి డైరెక్టర్లకు, రైతుబంధు ఆత్మ మార్కెట్ సభ్యులకు ప్రెస్ మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

# కానిస్టేబుల్‌కు ఎంపికైన కేజీబీవి విద్యార్థి

పుల్కల్,అక్టోబర్ 28 : మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాలలో 2015లో పదో తరగతి చదివిన శిరీష అనే విద్యార్థి ప్రస్తుతం కానిస్టేబుల్‌కు ఎంపికైందని పాఠశాల ఎస్ఓ ఇందిరా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థి శిరీష కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. శిరీష స్వగ్రామం కొనాపూర్, కొండాపూర్ మండలం తండ్రి బాలకృష్ణ, తల్లి అనురాధ దంపతులకు ముగ్గురు సంతానం. అందులో రెండో కూతురు శిరీష, పెద్దకూతురు గ్రూప్స్‌శిక్షణ తీసుకుంటుండగా, కుమారుడు బిటెక్ చదువుతున్నాడని తండ్రి తెలిపారు. శిరీష కానిస్టేబుల్‌కు ఎంపికైనట్లు తెలుసుకున్న ఎస్ఓ ఇందిరా, ఉపాధ్యాయ బృందం శనివారం ఆమెను పాఠశాలకు ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. ఇదే పాఠశాలలో చదువుకుని ఈ రోజు మా ఉపాధ్యాయులతో సన్మానించుకోవడం ఎప్పటికీ మరిచిపోలేనని, బాధ్యతగా తనవంతు ప్రజలకు సేవచేస్తూ విధులు నిర్వర్తిస్తు మంచి పేరు తీసుకొస్తానని శిరీష తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మాబాయి, రజనీ, రాణి, ప్రియాంక, మాధవి, నిర్మల పాల్గొన్నారు.



శిరీషను సన్మానిస్తున్న ఎస్ఓ ఇందిర, ఉపాధ్యాయులు

## సిర్గాపూర్ హైస్కూల్‌లో సీఎం బ్రేక్ ఫాస్ట్ ప్రారంభం

సిర్గాపూర్, అక్టోబర్ 28 : సిర్గాపూర్‌లోని జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం సీఎం అల్పాహారం పథకం కార్యక్రమాన్ని స్థానిక స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్‌ం నాగారం శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ మేరకు మెనూ ప్రకారం ఈ రోజు హాజరైన 100మంది విద్యార్థులకు పోహా (అట్కులు) అల్పహారాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శివకుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు పోహా అల్పహారాన్ని ఇచ్చి పథకాన్ని ప్రారంభించిన ఉపాధ్యాయులు

## నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

సిర్గాపూర్, అక్టోబర్ 28 : మండలంలోని కడ్పల్‌లో తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులు నందిని, చరణ్‌కు ఎన్‌టీటీ డాటా సాఫ్ట్‌వేర్ సంస్థ డైరెక్టర్ తిప్పరాజుప్రసాద్, సామాజిక సేవాకర్త చంద్రశేఖర్ ఆచార్య సహకారంతో నెలకు సరిపడా నిత్యావసర సరకులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దాత తిప్పరాజుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్ పాల్గొన్నారు.



చిన్నారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న తిప్పరాజుప్రసాద్

## చిరుత దాడిలో గేదె దూడ మృతి

సిర్గాపూర్, అక్టోబర్ 28: మండలంలోని ఖాజాపూర్ శివారులో చిరుత సంచారంతో కలకలం లేపుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి చిరుత దాడిలో గేదె దూడ మృతి చెందింది. ఖాజాపూర్ గ్రామానికి చెందిన రైతు వడిత్య గురునాథ్ రోజు వారిగానే తన పొలంలోని కొట్టంలో పశువులను ఉంచారు. శనివారం ఉదయం పొలం వెళ్లి కొట్టంలో ఉన్న దూడ కళేబరాన్ని చూసి అర్ధరాత్రి దాటాక దూడపై చిరుత దాడి చేసి చంపేసిందని బాధిత రైతు తెలిపారు. చిరుత సంచరించి పాద ముద్రల ఆనవాళ్లు స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. చిరుత బారి నుంచి అటవీశాఖ అధికారులు కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ముగిసిన క్రికెట్ టోర్నీ

కోహీర్, అక్టోబర్28: మండలంలోని వెంకటాపూర్‌లో క్రికెట్ టోర్నీ శనివారం ముగిసింది. వికారాబాద్ జిల్లాలోని పట్లూర్ తండాకు చెందిన జట్టు విజేతగా నిలిచింది. విజేతకు కప్పుతో పాటు రూ. 25వేలు అందజేశారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతకు కప్పుతో పాటు నగదును అందజేస్తున్న నిర్వాహకులు